

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 1,340 మంది హాజరు

పార్వతీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఆదివారం జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్) నిర్వహించినట్లు ఇన్‌చార్జి డీఈవో ఎస్.తిరుపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 1,375 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 1,340 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. సోమవారం ప్రాథమిక కీ విడుదల చేస్తామన్నారు. దాని పై అభ్యంతరాలు ఉంటే ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా తెలియజేయాలన్నారు. కార్యాలయపు వెబ్‌సైట్‌లో గ్రీవెన్స్ లింకు ద్వారా అభ్యంతరాలు స్వీకరిస్తామని వెల్లడించారు.

కొనుగోల్ చేరుకునేలా!



తడి ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న దృశ్యం

- లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ
- 48 గంటల్లోనే బిల్లుల చెల్లింపులు
- కూటమి ప్రభుత్వం చర్యలతో రైతులు హర్షం
- గత వైసీపీ సర్కారు తీరుపై మండిపాటు

పార్వతీపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో శరవేగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగుతోంది. రైతులకు ఏ ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. లక్ష్యాల మేరకు ధాన్యం సేకరిస్తున్నారు. మరోవైపు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే అన్నదాతల ఖాతాలకు ప్రభుత్వం నగదు చెల్లిస్తోంది. దీంతో జిల్లాలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తమది రైతు ప్రభుత్వమని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ధాన్యం సేకరణ నుంచి బిల్లుల చెల్లింపుల వరకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రైతన్నలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అయితే ప్రస్తుతం ఆ కష్టాలకు కూటమి ప్రభుత్వం చెక్ చెప్పగా.. సమీపంలో రైతులకు ఇష్టమైన మిల్లులకే ధాన్యం తరలించుకునే స్వేచ్ఛ ఇవ్వడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో..

వైసీపీ పాలనలో పరిస్థితిని పరిశీలిస్తే.. గత ఏడాది డిసెంబరు 8 నాటికి 9,165 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 2లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అప్పట్లో లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే కేవలం 1005 మంది రైతుల నుంచి 4.17 శాతం మాత్రమే కొనుగోలు చేశారు.

- జిల్లాలో 96 రైస్ మిల్లర్ల నుంచి రూ.168 కోట్లు బ్యాంకు గ్యారెంటీలుగా స్వీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 39 రైస్ మిల్లర్ల నుంచి రూ.16.54 కోట్లు మాత్రమే బీజీలుగా స్వీకరించారు.
- మిల్లర్లకు చెల్లించాల్సిన పే బిల్స్ బీజీలకు గాను అప్పట్లో రూ.16.49 కోట్లు జమ చేశారు. గత ఏడాది డిసెంబరు 8 నాటికి మొత్తంగా రూ. 33.3 కోట్లను బీజీలుగా స్వీకరించారు.
- గత సంవత్సరం రూ.14.79 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేపట్టి రూ.4.5 కోట్లు మాత్రమే చెల్లించారు.
- ధాన్యం విక్రయించిన తర్వాత రైతులు తమ సొమ్ము కోసం రోజూ సెల్ ఫోన్ మెసేజ్‌ల కోసం ఎదురుచూడాల్సి వచ్చేది.
- సకాలంలో నగదు జమకాకపోవడంతో రైతులు పండగలు, శుభకార్యాలను చేసుకోలేని పరిస్థితి.
- వైసీపీ నాయకులు అనుకూలంగా ఉండే మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించేవారు.

కూటమి పాలనలో..

- జిల్లాలో 2లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ నెల 8 వరకు 6,264 రైతుల నుంచి 40,290 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. లక్ష్యంగా నిర్ణయించుకున్న దానిలో ఇప్పటికే 18.31శాతం మేర కొనుగోలు చేశారు.
- 92 మంది రైస్ మిల్లు యజమానుల నుంచి రూ. 79.25 కోట్ల మేర బ్యాంకు గ్యారెంటీలను స్వీకరించారు.
- గత వైసీపీ ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో...)



రవాణా కోసం ధాన్యం బస్తాలను సిద్ధం చేస్తున్న రైతులు

మళ్లీ తుఫాన్



- జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు
- రైతుల్లో ఆందోళన
- పంటను కాపాడుకునేందుకు పాట్లు

గరుగుబిల్లి/సాలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఫెంగల్ తుఫాన్ జిల్లా రైతులకు నష్టం మిగిల్చింది. ఇంకా దాని నుంచి తేరుకోక ముందే మళ్లీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. దీంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. పంటను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. గత రెండు రోజులుగా వాతావరణం తెరిపివ్వడంతో సాలూరు ఏజెన్సీ, గరుగుబిల్లి తదితర ప్రాంతాల్లో రైతులు వరి కోతలు, నూర్పులు చేస్తున్నారు. కొందరు ధాన్యం ఆరబెట్టుకున్నారు. అయితే, ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృత మైంది. చిరుజల్లులు కూడా కురిశాయి. దీంతో రైతులు బెంబెలెత్తారు. ఆరబెట్టిన ధాన్యం, పంటలను కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. శనివారం రాత్రి కురిసిన జల్లులకు గురుగుబిల్లిలో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. వాటిని బస్తాలకు ఎత్తారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 11,12 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించింది. రైతులు తమ పంటలను జాగ్రత్త చేసుకోవాలని సూచించింది.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

పార్వతీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సోమవారం జిల్లాకు రానున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న డీఆర్‌సీ సమావేశంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం పార్వ తీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమవుతారని వెల్లడించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు, కూటమి శ్రేణులకు తెలియజేశామన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి



8లో

హడలెత్తిస్తున్నాయ్..!

- వీధి కుక్కల స్వైరవిహారం
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు




పార్వతీపురం టౌన్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. వాటి దాడులకు గురై ఇప్పటికే ఎంతోమంది క్షతగాత్రులుగా మారారు. మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. రోజురోజుకూ వీధి శునకాల బెడద ఎక్కువవుతుండడంతో జిల్లావాసులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు బాధితులుగా మారడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు పీహెచ్‌సీలు, జిల్లా కేంద్రాసుపత్రిలో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వాటి సంఖ్య పెరుగుతున్నట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు చూసుకుంటే.. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో సుమారు 40 కేసులు నమోదయ్యాయి. కుక్కల దాడిలో గాయపడిన వారిలో అధికంగా వృద్ధులు, పిల్లలే ఉన్నారు. ఈనెల 7న జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురం గ్రామంలో కుక్కల దాడిలో 70 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. కాగా ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు కుక్కల దాడిలో ముగ్గురు చనిపోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించక పోవడంపై ప్రజా సంఘాల నేతలు, జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజును వివరణ కోరగా వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికి బ్లూ క్రాస్ వారి అనుమతి అవసరమన్నారు.



జిల్లా కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

పింఛన్ల తనిఖీకి సన్నద్ధం

- పైలెట్ ప్రాజెక్టుగా లచ్చయ్యపేటలో పరిశీలన



సాలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల తనిఖీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు సన్నద్ధమవు తున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా సీతానగరం మండలం లచ్చయ్య పేటలో ఈ నెల 9,10 తేదీల్లో పింఛన్లను పరిశీలించ నున్నారు. ఇందుకోసం 20 మంది అధికారులు బృందంగా ఏర్పడనున్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు, ఇతరుల జోక్యంతో అనర్హులు సైతం సామాజిక పింఛన్లు అందాయి. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక సచివాలయం పరిధిలో సామాజిక పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కాగా జిల్లాలోని లచ్చయ్యపేటలో 394 సామాజిక పింఛన్లు ఉన్నాయి. వాటిని బలిజిపేట, పార్వతీపురం మండలాల నుంచి వచ్చిన 20 మంది అధికారులు పరిశీలించనున్నారు. అనంతరం వాస్తవ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నారు. నివేదికలో వాస్తవాలు ప్రతిబించకపోతే పరిశీలనకు వెళ్లే వారు బాధ్యత వహించాల్సి ఉంటుంది. పైలెట్ ప్రాజెక్ట్ పరిశీలన ఫలితాలు అనంతరం రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను చేసే అవకాశముంది. జిల్లాలో 1,41,119 మందికి 14 రకాల సామాజిక పింఛన్లు అందిస్తున్నారు. వారిలో కొందరు అనర్హులు పింఛన్లు పొందుతున్నారని అధికారులు భావిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడును వివరణ కోరగా.. జిల్లాలో లచ్చయ్యపేటలో పింఛన్ల తనిఖీ చేయాలని ఆదేశాలు వచ్చాయ న్నారు. 20 అధికారుల బృందంతో పరిశీలన చేయనున్నామని తెలిపారు.

రాళ్లు తేలి.. అధ్వానంగా మారి!



- రహదారుల సౌకర్యానికి నోచని గిరిశిఖర గ్రామాలు
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. గిరిజనులకు శాపం
- అత్యవసర వేళల్లో తప్పని డోలీ మోతలు
- విద్య, వైద్యం, సంక్షేమ పథకాలకూ కొండ దిగి ఎక్కాల్సిందే..
- ఇబ్బందుల్లో ఆదివాసీలు
- కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

సీతంపేట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిశిఖర గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. దారి పొడవునా రాళ్లు తేలిపోవడంతో కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అత్యవసర సమయాల్లో గిరిపుత్రులకు వైద్య సేవలు అందడం లేదు. దీంతో డోలీ మోతలు తప్పడం లేదు. విద్య, వైద్యంతో పాటు సంక్షేమ పథకాలు పొందేందుకు కూడా కొండ దిగి ఎక్కాల్సి వస్తోంది. వాస్తవంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం 2019-24లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. అరకొరగా జరిగిన రోడ్డు పనులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో మారుమూల గిరిజన గ్రామాలు రహదారి సౌకర్యానికి దూరమయ్యాయి.



గిరిశిఖర గ్రామం నుంచి దిగువ ప్రాంతానికి డోలీతో వెళ్తున్న గిరిజనులు

ఇదీ పరిస్థితి

ఐటీడీఏ పరిధిలోని 20 సబ్‌ప్లాన్ మండలాల్లో సుమారు 1240 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో 2లక్షలకు పైగా గిరిజనులు నివసిస్తున్నారు. అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందకు పైగా గిరిజన గ్రామాలు కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోలేదు. సీతంపేట మన్యంలో రంగం వలస, ఎగువ ద్వారబంధం, ఉసిరికిపాడు, పెద్దసంకిలి, రుక్మిణిగూడ, ఈతమాను గూడ, వంబరెల్లి, అప్పన్నగూడ, ఎదురువాడ, ఎగువ కలువరాయిగూడంగి తదితర గిరిశిఖర గ్రామాలకు నడిచి వెళ్లలేని పరిస్థితి. రహదారి సౌకర్యం లేకపోవ డంతో ఆదివాసీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అత్యవసర సమయాల్లో పీహెచ్‌సీలకు వెళ్లాలంటే డోలీ మోతలు తప్పడం లేదు. గర్భిణులకు వైద్య పరీక్షలు, ప్రసవాల కోసం కొండ దిగి ఎక్కాల్సి వస్తోంది. రేషన్, అటవీ ఉత్పత్తులను వారపు సంతలకు తరలించడానికి ఆపసోపాలు పడాల్సి వస్తోంది.

రాళ్లు తేలి నడిచి వెళ్లలేని స్థితిలో ఉన్న అప్పన్నగూడ రహదారి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

గిరిశిఖర గ్రామాల్లో రహదారి సౌకర్యం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు కేటాయించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేసిన ఆ నిధులతో అనేక గిరిజన గ్రామాలకు ఫార్మేషన్, గ్రావెల్, సీసీ రహదారులు నిర్మించారు. దీంతో ఆ ఐదేళ్ల కాలంలో గిరిజనులకు రహదారి కష్టాలు ఉండేవి కావు.

వైసీపీ పాలనలో...

వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రహదారుల నిర్వహణ, మరమ్మతులను గాలికొదిలేసింది. ఇదిలా ఉండగా సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 20 సబ్‌ప్లాన్ మండలాల్లో చేపట్టిన రహదారి పనులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు విచారణ (మిగతా 8వ పేజీలో...)



8లో

రూ.63 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- శ్యామలాంబ పండగ లోపే పూర్తి
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ఆదరణ కోల్పోతున్న మీసేవ కేంద్రాలు

- ఆదాయం లేక ఆపరేటర్లు అవస్థలు
- మూయలేక, నడపలేక అయోమయం

8లో





విశాఖలో పారాగ్లైడింగ్

» విజయవంతమైన ట్రయల్‌రన్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు రుషికొండ బీచ్‌లో పారాగ్లైడింగ్ అందుబాటులోకి రానుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ బీచ్‌లో ఇప్పటికే బోటుషికార్, స్కూబా డైవింగ్ తదితర అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులో వున్నాయి. పారాగ్లైడింగ్ కొత్త అనుభూతిని అందించనుంది. నింగి, నేలను తాకుతూ సముద్రంలో ఎగసిపడే కెరటాలు... మరో పక్క ఎత్తైన కొండలను వీక్షిస్తూ నీలాకాశంలో విహరించడం పర్యాటకులకు మధురానుభూతినిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

అనంత పోలీసుల కస్టడీలో బోరుగడ్డ

విచారణలో 'తెలియదు, గుర్తులేదు..' సమాధానాలు

అనంతపురం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను ఆదివారం తెల్లవారుజామున అనంతపురం తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ బోరుగడ్డ యూట్యూబ్ చానల్‌లో మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ నిమిత్తం బోరుగడ్డను కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజుల కస్టడీ కోరారు. శనివారం అతనికి వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించారు. కాగా, బోరుగడ్డ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన్ను తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా.. అప్పటికే అక్కడి లైట్లన్నీ ఆర్పేశారు. వచ్చీ రాగానే అనిల్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసుస్టేషన్‌కు తాళం వేశారు.



విచారణకు సహకరించని అనిల్

విచారణలో అనిల్ పోలీసులకు సహకరించలేదని సమాచారం. 'తెలియదు.. పెద్దగా గుర్తులేదు..' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. అనిల్ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా 'నువ్వే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. 3 రోజుల కస్టడీ తర్వాత అతనికి సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత రాజమండ్రి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణ సమయాన్ని చూపి మంగళవారం ఉదయం అక్కడి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

» 11న రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు



విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండగా, ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తరువాత కూడా పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 11వ తేదీనాటికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 11వ తేదీన రాయలసీమలో విస్తారంగా, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

అన్నదాతలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కల్లాల్లో ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరి కోతలు వాయిదా వేసుకునేలా అన్నదాతలను అప్రమత్తం చేయాలని ఆదివారం రాత్రి కలెక్టర్లు, జేసీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతులు నూర్చిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వరికుప్పలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వ్యవసాయశాఖను ఆదేశించారు.

వెనక'బడి'ంది!



- » ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్
- » నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే
- » ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్
- » సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఉంటే సరైన ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న చోట సదుపాయాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల అసలు ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన బడి రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ బడి ఏ స్థాయిలో ఉంది? అనే కోణంలో వివరాలు సేకరించడంతో ఇప్పటివరకూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని తేలిపోయింది. బడుల్లో మౌలిక సదుపాయాలకు 5 స్టార్లు, అభ్యసన ఫలితాలకు 5 స్టార్లు ప్రామాణికంగా ఈ అధ్యయనం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 45,087 ఉంటే... వాటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. మరోవైపు సదుపాయాల్లో 87, అభ్యసన ఫలితాల్లో 311 బడులకు అసలు రేటింగే దక్కని (జీరో రేటింగ్) దారుణమైన స్థితిలో ఉన్నాయి.

సొంత భజనతో సరి

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు- నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని జగన్ పదే పదే సొంత భజన చేసుకున్నారు. తీరా ఇప్పుడు మౌలిక సదుపాయాల విభాగంలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. అదేవిధంగా అభ్యసన ఫలితాల్లో సైతం ఒక్కటీ ఫైవ్ స్టార్ సాధించకపోగా, కేవలం 41 పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ సాధించాయి. మిగిలిన 45 వేల పైచిలుకు బడులన్నీ త్రీ స్టార్, అంతకంటే తక్కువ స్థాయికే పరిమితమయ్యాయి.

> విద్యారంగంలో సంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీన స్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దారుణంగా దెబ్బతీశాయి. విద్యార్థుల హాజరు, ఫలితాలను పట్టించుకోకుండా టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పాటు బోధన సమయాన్ని తగ్గించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో బడుల్లో మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయని తేలిపోయింది. గత ప్రభుత్వం తీరుతో ఇప్పుడు పాఠశాలలు సింగిల్ స్టార్ దక్కించుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి.

స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

అన్ని జిల్లాల్లోనూ అదే తీరు

ప్రభుత్వ పాఠశాలల స్థితి దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ ఒకేలా ఉంది. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 2,913 బడులకు గాను 161 చోట్ల మాత్రమే మౌలిక సదుపాయాలు ఫరవాలేదన్నట్టుగా ఉన్నాయి.

బడులకు ఇచ్చిన రేటింగ్‌లు ఇలా..

స్టార్ రేటింగ్	మౌలిక సదుపాయాలు	అభ్యసన ఫలితాలు
జీరో స్టార్	87	311
ఒక్క స్టార్	1,958	14,095
టూ స్టార్	16,816	26,272
త్రీ స్టార్	19,438	4,368
ఫోర్ స్టార్	6,788	41
ఫైవ్ స్టార్	0	0


అయితే అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఒక్క బడి కూడా నాలుగు స్టార్లు సాధించలేదు. అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, కాకినాడ, కర్నూలు, ఎన్టీఆర్, నెల్లూరు, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లోనూ ఒక్క పాఠశాలకూ నాలుగు స్టార్లు దక్కలేదు. ఎక్కువ పాఠశాలలు రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి.

ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు- నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చింది.

నవ్య | చిత్రజ్యోతి

పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్, యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లోకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?





సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహాడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల చైర్మన్ టీడీ జనార్ధన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్ధన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్లు అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

ఒక్కసారి ప్రేమిస్తే చాలు



బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా...ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.



మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి

ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుమ్‌బాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, ఆలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



అరకులో మాస్ జాతర

రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లోకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అసత్య ప్రచారాన్ని ఆపండి

- రెహమాన్ కుమార్తె ఖతీజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైరా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్..సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

కాలువలు శుభ్రం లేక.. దుర్వాసన భరించలేక

● రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉంటున్న వైనం ● ఇదీ విజయనగరంలోని ఓరుగంటివారి వీధిలో పరిస్థితి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఓరుగంటివారి వీధిలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా చీకటిపడిన తర్వాత దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది ఎప్పటి కప్పుడు మురుగునీరు తొలగించాల్సిఉన్నా చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. దీనికితోడు మురుగునీరు నిల్వ ఉంటున్న చోటి నుంచే కొళాయిలు వెళ్తున్నాయి. దీంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశముందని ఓరుగంటివారి వీధి వాసులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే మునిసిపల్ అధికారులు స్పందించి మురుగునీటి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



మురుగునీటితో నిండిపోయిన కాలువ

తవ్వేశారు.. వదిలేశారు

● ఇంటింటికీ కొళాయిల కోసం గోతులు తవ్విన వైనం

● ఇదీ పోలిపల్లిలో పరిస్థితి

భోగాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిపల్లిలో ఇంటింటి కొళాయిల కోసం సీసీ రహదారులను తవ్వి పూడ్చకుండా వదిలేశారు. ఐదువేల మంది జనాభా నివసిస్తున్న గ్రామంలో ఇంటింటా కొళాయిల కోసం ఆరునెలల కిందట జలజీవన్ పనుల్లో భాగంగా కొళాయిల ఏర్పాటుకోసం సీసీ రహదారులను తవ్విన తర్వాత మట్టిని రోడ్డుపైనే విడిచి పెట్టారు. మట్టి సరిచేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై, గోతుల్లో నీరుచేరుతోంది. దీంతో సీసీ రహదారులకు ఇరువైపులా బురదమయంగా మారుతున్నాయి. దీనికితోడు గోతుల వల్ల చీకటిపడిన తర్వాత వచ్చిపోయే వృద్ధులు, మహిళలు పడిపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



తవ్విన గొయ్యిని పూడ్చని దృశ్యం

కూలీల కొరత.. యంత్రాలతో కోత

● జిల్లాలో జోరుగా నూర్పులు ● తడిసిమోపెడవుతున్న ఖర్చు ● వరి పంటను ఇళ్లకు చేరుస్తున్న అన్నదాతలు



పెదవేమలిలో యంత్రంతో వరి చేను కోస్తున్న రైతు

గంట్యాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):జిల్లాలో కూలీల కొరత, వాతావరణంలో మార్పుల నేపథ్యంలో రైతులు యంత్రాలతో వరి పంటను కోయడంతోపాటు నూర్పిడి ముమ్మరంగా చేస్తున్నారు. పండిన వరి పంటను ఒకప్పుడు ఇళ్లకు చేర్చడానికి రైతులు అవస్థలు పడేవారు. కోత కోసి, నూర్పులు వేయడానికి చాలా సమయం పట్టేది. పగలు, రాత్రి కళ్లాలు వద్ద పడికాపులు కాయాల్సివచ్చేది. వాతావరణంలో మార్పుల సమయంలో భయాందోళనలకు గురయ్యే వారు. ప్రస్తుతం యంత్రాల పుణ్యమాని రైతులకు ఊరట లభించింది.వరిచేను కోతకోసిన దగ్గర నుంచి నూర్పులు నూర్చిధాన్యం గాలిపోసే వరకూ యంతాలు అందుబాటులోకి వచ్చాయి. వరిచేను కోసి, ధాన్యం బయటకు తీయడానికి మరో మిషన్ ఈఏడాది అందుబాటులోకి రావడంతో రైతులు దీనిని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 98 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడం పంట చేతికొచ్చింది.ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో త్వరగా పంటను కోతకోయడానికి యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇప్పటివరకూ 60 శాతం వరకూ కోత కోసినట్లు రైతులు చెబుతున్నారు. మరో 20 శాతం వరకూ కూలీలతో కోతలు చేపట్టారు. ప్రధానంగా కోత ఖర్చు తడిసిమోపెడవుతోందని రైతులు చెబుతున్నారు. సాధారణ కూలీలతో ఎకరాకు రూ.ఐదు వేల వరకూ చెల్లించాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు.అదే యంత్రాలతో ఎకరాకు రూ.2,500 అవుతోందని చెబుతున్నారు. దీనికితోడు త్వరగా కళ్లానికి చేర్చాలని ఉద్దేశంతో కోత కోసిన వెంటనే నూర్పిడికి రూ. 3,500 వరకు వెచ్చించాల్సివస్తోంది.



సిరిపురంలో వరిచేను కోసి యంత్రంతో బయటకు ధాన్యంతీస్తున్న దృశ్యం

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు

●రాజాం బస్సు సర్వీసు రద్దుచేసిన వైనం

● ఇదీ అరసాడ- బాగెమ్మపేట రహదారి దుస్థితి



గోతులమయమైన బాగెమ్మపేట రహదారి

వంగర, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అరసాడ- బాగెమ్మపేట రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు చేయడం మరిచిపోయారు. నాలుగేళ్ల కిందట అరసాడవరకు బీటీరోడ్డు వేయడానికి రూ.మూడు కోట్లతో ప్రతిపాదనలను అధికారులు తయారుచేశారు. ఇంతలో గత శాసనసభ ఎన్నికల ముందు వైసీపీ నాయకులు ఆదరాబాదరాగా శంకుస్థాపనచేశారు. ఎన్నికల కోడ్ సమీపిస్తుండడంతో ఆర్థికపరమైన అనుమతిలేకుండానే ఆగమేగాల మీద భూమి పూజచేశారు. తర్వాత పనులు ఒక్క అడుగు ముందుకుకదల్లేదు.

తరచూ ప్రమాదాలు

అరసాడ-బాగెమ్మపేట రహదారి అడుగడుగునా గోతులమయమయ్యింది. నిత్యం వందలాది ఈ రహదారి గుండా నీలయ్యవలస, పటువర్ధనం దేవకివాడ, కింజంగి తదితర ప్రాంతాలకు రాజాం నుంచి వెళ్లడానికి దగ్గర మార్గంకావడంతో రద్దీగా ఉంటోంది. దీనికితోడు ఇంటర్, డిగ్రీ విద్యార్థులు రాజాం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతోపాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనం దగ్గరకు వచ్చే వరకూ కనిపించడంలేదు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతఏడాదిగా గోతులు పెద్దవికావడంతో నిత్యం రాజాం నుంచి తిరిగే ఆర్టీసీబస్సు సర్వీసు రద్దుచేశారు. దీంతో విద్యార్థులు, వివిధ పనులపై వెళ్లే వారంతా అవస్థలకు గురవుతున్నారు. రాజాం ప్రధాన రహదారికి ఆరు కిలోమీటర్లు దూరం ఉన్న ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు.రోడ్డంతా పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో వచ్చిపోయే ద్విచక్రవాహనాలు పల్టీలు కొట్టడంతో పలువురు గాయపడుతున్నారు. కాగాఅరసాడ -బాగెమ్మపేట రహదారి అభివృద్ధికి రూ.మూడు కోట్లు అంచనాలు తయారు చేశామని పంచాయతీరాజ్ ఏఈ ఆనంద్ తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులుచేస్తామని చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా ఉండే కంచికచెట్లు తొలగించి వాహనచోదకులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

దత్తిరాజేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానాపురం సంత తోట వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన కొలుసు రమణ(60) ఆదివారం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మానాపురం ఎస్‌ఐ ఆర్.జయంతి తెలిపారు. పెదమానాపురం సంత తోట వద్ద శనివారం తెల్లవారుజామున ఆర్టీసీబస్సు ఢీకొనడంతో వంగరకు చెందిన గెంజిమహేష్ మృతిచెందగా, కొలుసు రమణ, తిరండి నరసింగరావు గాయపడిన విషయం విదితమే.వీరిద్దరూ చికిత్సపొందుతుండగారమణ ఆదివారంమృతిచెందాడని ఎస్‌ఐ తెలిపారు.రమణకు భార్యముగ్గురు పిల్లలు ఉన్నారు.

విజయనగరంలో..

నెల్లిమర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారసాంలో 15 రోజుల కిందట జరిగిన ట్రాక్టరు ప్రమాదంలో గాయపడి విజయనగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టి.రామకృష్ణ (35) ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. నెల్లిమర్ల పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

రామభద్రపురంలో ఒకరి ఆత్మహత్య

రామభద్రపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మారుతీ నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానిక ఎస్‌ఐ వెలమల ప్రసాద్ కథనం మేరకు.. మారుతీనగర్‌కు చెందిన షేక్ బాబ్జీ(43) స్థానికంగా ఉన్న ఒక బైకు మెకానిక్ వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు.ఆయన తరచూ మద్యంతాగి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాబ్జీ ప్లాస్టిక్ పైపునకు చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాబ్జీకి ఇంకా వివాహం కాలేదు. ఆయనకు తల్లిదండ్రులు ఉన్నారు.

సంఘీభావ సభను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఈనెల 12న గుంటూరులో నిర్వహించనున్న పాలస్తీనా సంఘీభావ సభకు ప్రజలు విద్యార్థి సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఎస్‌వైఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం విజయనగరంలోని వైఎస్సార్ నగర్‌లోని కార్యాలయం సమీపంలో సంఘీభావ సభ గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గిరిప్రసాద్, గౌతమి, దిలీప్‌కుమార్, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

ఇజ్జిపేటలో ట్రాక్టరు బోల్తా



ధాన్యం బస్తాలతో బోల్తాపడిన ట్రాక్టర్

సంతకవిటి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇజ్జిపేట వద్ద ఆదివారం ధాన్యం బస్తాలతో వెళ్తున్న ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ధాన్యం బస్తాలు ఒక్కసారిగా ట్రాక్టరులో నుంచి రోడ్డు పక్కన పొలంలో పడిపోయాయి. ప్రమాద సమయంలో ట్రాక్టరు పక్కన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అక్కడ ఉన్నవారు చెప్పారు. ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు, గ్రామస్థులు తెలిపారు. పలుసార్లు ఎడ్లబండ్లు కూడా ఈ రోడ్డులో తిరిగిబడినపోయిన విషయం విదితమే. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సారా విక్రయాలకు దూరంగా ఉండాలి



మెంటాడ: గిరిజనులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ సీతారాం

మెంటాడ (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 8: సారా విక్రయాలు, వినియోగదానికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ సీతారాం సూచించారు. ఆదివారం మండలంలోని కొండపర్తిలో ఫ్రైండ్లీ పోలీసింగ్‌లో భాగంగా గిరిజనులతో మాట్లాడారు. వారి జీవన విధానం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధానికి పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం గిరిజనులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోతుగెడ్డ సర్పంచ్ భీమారావు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, పైడితల్లి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు...

సంతకవిటి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు సూచించారు. మండలంలోని గోళ్లవలసలో మత్తు పదార్థాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాలరావు పాల్గొన్నారు.

రామతీర్థం రోడ్డులో చైన్‌స్నాచింగ్

నెల్లిమర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):నెల్లిమర్ల -రామతీర్థం రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం చైన్‌స్నాచింగ్ జరిగింది. నడుస్తున్న మహిళ మెడలో నుంచి ఓ గుర్తుతెలియని యువకుడు తులం బంగారు నెక్లెస్ తెంపుకొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు నిందితుడు ఎరుపు రంగు పల్సర్ బైక్‌పై రామతీర్థం - రణస్థలం రోడ్డు వైపు వెళ్తున్నట్లు సీసీ ఫుటేజీలో గుర్తించారు. నిందితుడి వివరాలు తెలిస్తే 9121109444 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

భగవద్గీత పోటీలకు ఇద్దరి ఎంపిక

డెంకాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భగవద్గీత పఠన పోటీల బి కేటగిరి విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు కృష్ణాపురానికి చెందిన విద్యార్థులు లోచర్ల హసిత కోమల్, డి విభాగంలో జి.ఆద్య ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 15న కడపలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ మేరకు విద్యార్థులను పలువురు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన ఎస్.కోట డీఎం

శృంగవరపుకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ విశాఖలోని కైలాసగిరి పోలీస్‌పరేడ్ మైదానంలో ఈనెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగిన అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్‌లో సత్తాచాటారు. 50 ఏళ్లలోపు ఆర్టీసీఅధికారులకు నిర్వహించిన 1000మీటర్లు వాకింగ్‌లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించారు. ఈమేరకు రమేష్ ఆర్టీసీ అధికారులు, డిపో సిబ్బంది అభినందించారు.

నేడు గరివిడిలో జాబ్‌మేళా

గరివిడి (మెరకముడిదాం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గరివిడిలో సోమవారం జరిగే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోరారు.ఆదివారం మెరకముడిదాం మండలంలో చినబంటుపల్లిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలోటీడీపీ నాయకుడు కోట్ల మోతీలాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

విజయనగరం క్రైం, డిసెంబరు 8: (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను సోమవారం ఉదయం 10.30 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ టి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

రాజాం,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజాంలోని జీఎంఆర్ నైరెడ్‌లో శిక్షణకు మంగళవారం ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ పీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 40 ఏళ్ల వయస్సు గల మహిళలకు హోం నర్సింగ్, లేడీస్ టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, పురుషులకు ఎలక్ట్రికల్ వైరింగ్, ఫోటోఅండ్ వీడియోగ్రఫీలో 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫామ్ సౌకర్యం కల్పించడంతోపాటు బస్‌చార్జీలు, టూల్‌కిట్ ఇవ్వనున్నట్లు తెలిపారు.వివరాలకు949141129. 9014 7 16255 నెంబర్లుకు సంప్రదించాలని కోరారు

విజినిగిరికి బాసట

శృంగవరపుకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జామి మండలంలోని విజినిగిరి గ్రామానికి జిల్లా హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ బాసటగా నిలిచింది. ఈ మేరకు గ్రామంలో ఆ సంస్థ రూ.1.50 లక్షలు ఖర్చుచేసి శ్మశాన వాటిక, వాటర్ ట్యాంకు నిర్మించినట్లు సర్పంచ్ కిలారి సూర్యారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు కొవ్వాడసన్యాసినాయుడు, కిలారి శ్రీనివాసరావు,మిడతాన తాతనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్‌డీపీ

డెంకాడ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) :చింతలవలసలోని మహరాజ్ విజయరాం గజపతి రాజు ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం (ఎంవీజీఆర్)లో ఏఐఎఎల్ అకాడమీ సహకారంతో ఆవిష్కరణాత్మక గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, నిల్వ సాంకేతికతలపై ఆరు రోజులుగా నిర్వహించిన ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ)ఆదివారం ముగిసింది.ఈ సందర్భంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, నిల్వ సాంకేతికతల్లో అందుబాటులోఉన్న అవకాశాలను పురోగతులను వివరించారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 200 మందికిపైగా ఫ్యాకల్టీ, పరిశోధకులు, పీజీటీ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

అన్ని సామాజిక వర్గాల సంక్షేమమే లక్ష్యం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

విజయనగరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక ఐఎంఏ ఫంక్షన్‌హాలులో గజపతినగరం జనసేన ఇన్‌చార్జి మర్రాపు సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కొప్పలవెలమ కార్పొరేషన్ ఆత్మీయ సమావేశంలో నూతనంగా నియమితులైన కార్పొరేషన్ డైరెక్టర్లు, ఛైర్మన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టబడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తామని తెలిపారు. వెలమ కార్పొరేషన్ డైరెక్టరు మిడతాన రవికుమార్ పోరాట పటిమ, కష్టించే మనస్తత్వం గల వ్యక్తి అని కొనియాడారు.నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకంనాగమాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి అన్న లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. గజపతినగరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రాపు సురేష్ మాట్లాడుతూ మూడుపార్టీలు కలిసి పోటీ చేయడం వల్లే వైసీపీని మట్టి కరిపించామన్నారు. కార్పొరేషన్ డైరెక్టరు మిడతాన రవికుమార్ మాట్లాడుతూ జగన్ విద్య, ఉపాధి, వైద్య రంగాలను నాశనంచేశారని ఆరోపించారు.తనను గుర్తించిన జనసేన టీడీపీ అధినేతలుపవన్‌కళ్యాణ్,చంద్రబాబు నాయుడుకు దన్యవాదాలు తెలిపారు. తాను పదేళ్లు ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ఈ పదవి లభించిందన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌ను వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావనీ, జనసేన నాయకులు, టీడీపీ నాయకులు ఆదాడ మోహనరావు పాల్గొన్నారు.

గరివిడిలో పూర్వ విద్యార్థుల సందడి



ఆత్మీయ కలయికలో ఓ బ్యాచ్ పూర్వవిద్యార్థులు

గరివిడి,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):గరివిడిలోని శ్రీరాం ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 1962 నుంచి ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశం నలుమూలలతోపాటు విదేశాల్లో స్థిరపడ్డారు. అప్పటి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న 400మంది విద్యార్థులు కలుసుకున్నారు. వారంతాసాయంత్రం నాలుగువరకు ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిచేశారు. ఈ సందర్భంగా 70 సంవత్సరాలుపైబడిన వారు కూడా ఇక్కడకు వచ్చి బాల్యంలో గడిపిన రోజులను గురుచేసుకున్నారు. ఒక్కో బ్యాచ్ విద్యార్థులు ఫొటోలకు దిగారు. ప్రతిఏటా కలుసుకోవాలని నిర్ణయించారు.

గొర్రెల యజమానులను ఆదుకోవాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు



గొర్రెల యజమానులతో మాట్లాడుతున్న రాంబాబు

నెల్లిమర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అకాల మృత్యువాతకు గురైన గొర్రెల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు రాంబాబు డిమాండ్‌చేశారు. మండలంలోని పెదబూరాడపేటలో ఇటీవల వరి కంకులు తిని 100 గొర్రెలు మృత్యువాతపడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన ఆ గ్రామంలో బాధిత గొర్రెల యజమానులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదబూరాడపేటతో పాటు బుడతనాపల్లి, రయింద్రాం గ్రామాల్లో ఈ తరహా గొర్రెల మరణాలు సంభవించాయని తెలిపారు. గొర్రెల యజమానులను ప్రభుత్వం ఆదుకోవడానికి పశు సంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు త్వరగా చర్యలు చేపట్టాలనికోరారు.

దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలి

● సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవంలో ఒడిశా గవర్నర్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ రఘుబర్‌దాస్

పర్లాకిమిడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు నైపుణ్యం పెంపొందిస్తూ సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతిభనుసాధించడంలో ఒక మైలురాయిని దాటిందని, ఇది అభినందనీయమని ఒడిశా రాష్ట్ర గవర్నర్ రఘుబర్‌దాస్ అన్నారు. భువనేశ్వర్‌లోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఈ దేశాన్ని అభివృద్ధి పథకంలో తీసుకువెళ్లే బాధ్యత యువతపై ఉందని,దేశ సమగ్రాభివృద్ధికి ఒడిశా పురోగతి కీలకమని, జాతి పురోగతి యువతరం ఆకాంక్ష కావాలని పిలుపునిచ్చారు. మరో అతిథి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ సందీప్ మెహతా, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్ ఫణికర్ సోమనాథ్ మాట్లాడుతూ.. భారతదేశం సాంకేతిక, సామాజిక ప్రకృతి దృశ్యాన్ని రూపొందించే దిశలో యువత జ్ఞానసాధన స్థిరంగా ఉండాలన్నారు. సుమారుగా 2800 మంది విద్యార్థులకు అతిథులు ధ్రువపత్రాలు, 47 మందికి డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు, ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రో, ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ డీఎన్ రావు, రిజిస్ట్రార్ అనితా పాత్ర, వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల శాలగా సచివాలయ భవనం

● నిధులు మంజూరు కాక.. పనులు చేయక

● ఇదీ చినకవులవాడ గ్రామ సచివాలయం పరిస్థితి



పశువుల శాల నిర్వహిస్తున్న గ్రామ సచివాలయం భవనం ఇదే

భోగాపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): చినకవులవాడ గ్రామ సచివాలయం పనులు నిధులు మంజూరుకాకపోవడంతో పూర్తికాలేదు.ఇక్కడ వైసీపీ ప్రభుత్వంలో రూ.40లక్షలతో 2020 అక్టోబరులో సచివాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కొంతమేర నిధులు మంజూరు కావడంతో సచివాలయం పనులు ప్రారంభించారు. తర్వాత వివిధకారణాలతో నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో సచివాలయం నిర్మాణం పూర్తికాకపోవడంతో స్థానికులు పశువుల శాలగా వినియోగిస్తున్నారు. ప్రజల అవసరాలకు వినియోగించాల్సిన భవనాన్ని శాలగా మార్చడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామ సచివాలయ భవన నిర్మాణ భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని చినకవులవాడ గ్రామస్థులు కోరుతున్నారు. కాగా పరిశీలించి పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కిశోర్‌కుమార్ తెలిపారు.

కొనుగోల్ చేరుకునేలా!

(ఐదో పేజీ తరువాయి)

చెల్లించాల్సిన పే బిల్స్‌కు సంబంధించిన దానిలో రూ. 17.70 కోట్లను కూటమి సర్కారు బ్యాంకు గ్యారెంటీలుగా జమచేసింది. ఇప్పటివరకు రూ.96.95 కోట్లను బీజీలుగా స్వీకరించారు.

● కొనుగోలు చేసిన ధాన్యం ప్రాప్తికి రూ.92.67 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇందులో రైస్ మిల్లర్ల జనరేట్ చేసిన మేరకు రూ.79.22 కోట్ల రైతులు ఖాతాల్లోకి ప్రభుత్వం జమచేసింది.

● ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినప్పటికీ ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తుండడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.79 కోట్లు చెల్లింపు..

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ.79 కోట్లు చెల్లించాం. ఇప్పటివరకు 40,290 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ప్రభుత్వం 48 గంటల్లో డబ్బులు జమ చేస్తామని ప్రకటించి నప్పటికీ 24 గంటల్లోనే నగదు చెల్లిస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి 9,165 మెట్రిక్ టన్నులు సేకరించి రూ.4.50 కోట్లు ఖాతాల్లో జమ చేశాం.

-ఎ.శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

రాళ్లు తేలి.. అధ్వానంగా మారి!

(ఐదో పేజీ తరువాయి)

చేపడుతున్నారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా నిర్మించిన 36 రోడ్లకు సంబంధించి సుమారు రూ.52 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో సంబంధిత అధికారులు సీతంపేట ఏజెన్సీలో రహదారి పనులను పరిశీలించారు.

బడ్జెట్‌లో నిధుల కేటాయింపు..

కూటమి ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ఐటీడీఏలకు ప్రత్యేక నిధులు కేటాయించింది. వాటితో సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఏడు టీపీఎంయూ మండలాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. సీసీడీపీ నిధులు రూ.5 కోట్లతో పీవీటీజీ ఆదివాసీ గ్రామాల్లో వరదగోడలు, అంతర్గత సీసీ రహదారుల నిర్మాణాలను ఇప్పటికే ప్రారంభించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

ప్రభుత్వం దృష్టి సారించాలి..

గత వైసీపీ సర్కారు గిరిజనుల సమస్యలను పట్టించుకోలేదు. దీంతో గత ఐదేళ్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. పక్కా రహదారులతో పాటు తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలి. యుద్ధ ప్రాతిపదికన రోడ్లు నిర్మించి డోలీ మోతలు తప్పించాలి.

- పాలక సాంబయ్య, గిరిజన సంఘం నాయకుడు

అంచనాలు సిద్ధం చేస్తున్నాం

గిరిశిఖర గ్రామాల్లో సుమారు 13 రహదారులు నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేస్తున్నాం. నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నాం.

- పి.రమాదేవి, ఈఈ, టీడబ్ల్యూ

విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

బొబ్బిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల రెన్యువల్ విషయంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక సీపీఎం, సీపీఐ, రైతు సంఘం తదితర నాయకులు ఆదివారం బొబ్బిలిలో వేర్వేరుగా మాట్లాడారు. బాలికల హైస్కూలు గుర్తింపు రెన్యువల్ చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవడం సరికాదన్నారు. రెన్యువల్ కాకపోతే విద్యార్థులు పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోతారని, అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అన్యాయమన్నారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరరావు, కోట అప్పన్న, శ్రీనివాస్, లక్ష్మనాయుడు తదితరులు ఉన్నారు.

10 నుంచి శిక్షణ కార్యక్రమాలు

బొబ్బిలిరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10 నుంచి 13 వరకు గ్రామ సర్పంచ్‌లకు, మండల టీం అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. 10, 11 తేదీలలో సర్పంచ్‌లు, మండల టీం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్ 1, 2, 3, 4), వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ సర్వే అసిస్టెంట్లు, జేఎల్‌ఎంలకు, 12, 13 తేదీలలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా సమాఖ్య కార్యదర్శులు, గ్రామ పశు సంవర్థక సహాయకులు, రెవెన్యూ అధికారులు, ఏఎన్‌ఎంలకు ఉదయం 9 నుంచి శిక్షణ ఉంటుందని ఆయన వివరించారు. రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షణకు వస్తారని ఎంపీడీవో తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

రామభద్రపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ వెలమల ప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు చివరిలో ఆదివారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనచోదకులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ వాహనాల తనిఖీల్లో హెడ్ కానిస్టేబుళ్లు నాగేంద్ర, నారాయణ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

గరుగుబిల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఆదివారం స్థానిక ఉల్లిభద్ర ఎర్రన్నగుడి సముదాయంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10, 11 తేదీల్లో కురుపాంలో నిర్వహించనున్న మహాసభలకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. జిల్లా సభ్యులు కె.గంగునాయుడు, వై.మన్మథరావు, బీవీ రమణ, కె.రవీంద్ర, కె.సీతారాం, డి.వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

గరుగుబిల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మండల శాఖ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు సూచించారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. సెలవు రోజుల్లో విద్యార్థులకు ఆట, పాటలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

బొబ్బిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్లపల్లి బైపాస్ రోడ్డులో గల దాడితల్లి అమ్మవారి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవల్లీదే వసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే మల్లమ్మపేట అయ్యప్పస్వామి ఆలయంలో, అగురు వీధి సీతారామ దేవాల యంలో నిర్వహించిన వేడుకల్లో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆదరణ కోల్పోతున్న మీ-సేవ

● ఆదాయం లేక ఆపరేటర్లు అవస్థలు

● కేంద్రాలు మూయలేక, నడపలేక అయోమయం

గజపతినగరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం.. ఓటరు కార్డులో మార్పులు, చేర్పుల కోసం.. ఇంటిపన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నా ఒకప్పుడు మీసేవ కేంద్రాలే దిక్కు. అటువంటి కేంద్రాలు నేడు ఆదరణ కోల్పోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్రబాబు మీసేవ కేంద్రాలను ప్రవేశ పెట్టారు. ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించేలా వీటిని తీర్చిదిద్దారు. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక మీసేవ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. దీంతో ఆపరేటర్లు అటు కేంద్రాలను నడపలేక ఇటు మూసివేయ లేక అయోమయంలో ఉన్నారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టీసీఎస్ భాగస్వామ్యంలో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సచివాలయాల రాకతో అవసరం తగ్గింది

2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు అయ్యాక మీసేవా కేంద్రాల అవసరం తగ్గిపోయింది. మీసేవా కేంద్రాల నిర్వహకులు హైకోర్టును ఆశ్రయించడంతో కొన్ని చోట్ల అవి కొనసాగుతున్నాయి. 2014-19 వరకు 350 రకాల సేవల్ని మీసేవ కేంద్రాల్లో అందించేవారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో గ్రామ వార్డు సచివాలయాల రాకతో అంతకు ముందు ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలు మరుగునపడ్డాయి. రిజిస్ట్రేషన్‌కు శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోళ్లలో మ్యూటేషన్ పత్రాలు కూడా మీసేవ కేంద్రాల్లో జారీ చేసేవారు. ప్రస్తుతం ఈ సేవలు రద్దు చేశారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా ఆస్తులకు ఈసీలు పొందే వెసులుబాటు ఉండేది. సచివాలయాల రాకతో అవన్నీ మాయమయ్యాయి.

సాంకేతిక సమస్య..

సచివాలయాల్లో జారీ చేసే ధ్రువీకరణ పత్రాల విషయంలో మరో సాంకేతిక సమస్య ఎదురవుతోంది. మీసేవ కేంద్రాల్లో నిర్ణీత రుసుం చెల్లిస్తే ఎన్ని కాపీలైనా ప్రింట్ చేసే అవకాశం ఉంటుంది. అయితే సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్, ఇన్‌కం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ వంటి వాటికి ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీసేవ కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. పీడీఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలు సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని మీసేవా కేంద్రాలు నిరాకరిస్తున్నాయి.



మీ సేవా కేంద్రం

కూటమి ప్రభుత్వంపై ఆశలు

గత ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో లోకేశ్‌ను కలిసిన ఆపరేటర్లకు మీసేవలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. లోకేశ్ తోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, సీఎం చంద్రబాబు తమకు న్యాయం చేస్తారని మీసేవలకు పూర్వ వైభవం తీసుకువస్తారని ఆపరేటర్లు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రూ.63లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సాలూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సుమారు రూ.63 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం శంకుస్థాపన చేశారు. అఫీషియల్ కాలనీలో, బోసుబొమ్మ కూడలి వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. శివాలయం రోడ్డులో, వినాయక అపార్ట్‌మెంట్ సమీపంలో కాలువ పనులను, గొల్లవీధిలో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వినాయక అపార్ట్‌మెంట్ నివాసితులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్యామలాంబ పండగ లోపే పనులు పూర్తి

రానున్న శ్యామలాంబ పండుగ లోపే పట్టణంలో ఉన్న 29 వార్డుల్లో సాముహిక మరగుదొడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేస్తామని మంత్రి తెలిపారు. పట్టణంలో ఉన్న అనేక సమస్యలను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వద్ద ప్రస్తావించానని చెప్పారు. అన్ని వార్డుల్లోనూ పైలెట్ వాటర్ స్కీంలు ఏర్పాటు చేశామన్నారు. గత బిల్లులు కూడా గుత్తేదారులకు పడేలా ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, వాడాడ శోభారాణి, వైదేహి, అక్కేన అప్పారావు, హర్షవర్ధన్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి 8వ వార్డులో స్వయంగా ప్రొక్లయినర్‌ను నడిపారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సంధ్యారాణి

అనంతరం దేశమ్మతల్లికి పూజలు చేశారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.



సాలూరు రూరల్: శిఖపరువు గోముఖి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



సీతంపేట రూరల్: ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి

సీతంపేట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఆడలి వ్యూపాయింట్, మెట్టుగూడ జలపాతం, సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. వివిధ సాహసోపేత క్రీడల్లో పాల్గొని, ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

● సాలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీలో ఉన్న జలపాతాల వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. సాలూరు మండలంలో దళాయివలస రాంధారి, లొద్ద హనుమబారి జలపాతం, శిఖపరువు గోముఖి జలపాతాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.



ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో చిన్నారుల సందడి

కాలుష్య కోరల్లో..

● చెత్తా చెదారాలతో నిండిపోతున్న చెరువులు

● వెదజల్లుతున్న దుర్గంధం.. ఇబ్బంది పడుతున్న బొబ్బిలి పట్టణ, మండల వాసులు

బొబ్బిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణం, మండలంలో ఉన్న అనేక చెరువులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. ఎక్కడ లేని వ్యర్థ పదార్థాలన్నీ చెరువుల్లోనే దర్శనమిస్తున్నాయి. ఇళ్లల్లో, వీధుల్లో నుంచి డ్రైనేజీ నీరు నేరుగా చెరువుల్లోకి మళ్లుతోంది. దీంతో చెరువులన్నీ దుర్గంధ భరితంగా తయారయ్యాయి. కోటిచెరువు, అమ్మిగారి కోనేరు, భైరిసాగరం, మల్లమ్మ చెరువు ఇలా అనేక చెరువులు వ్యర్థాలతో నిండిపోయాయి. కోటి చెరువు గట్టు డంపింగ్ యార్డు మాదిరిగా తయ్యారయ్యింది. వాహనాలతో చెత్తా చెదారాలను తీసుకొచ్చి ఇక్కడ పోగేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వీటిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

● బొబ్బిలి కోటి చెరువు గట్టుపై గతంలో పెద్దసంఖ్యలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించారు. గతంలో సీఐగా పని చేసిన ఇ.కేశవరావు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం అనేక చెట్లను మొదలుతో పాటు నరికేశారు.

చెరువులను కాపాడుకుందాం

చెరువుల మనుగడను కాపాడుకుందాం. బాధ్యతా రహితంగా చెరువులను కాలుష్యానికి గురిచేస్తున్నారు. చెరువుల శుభ్రతకు మా వంతు కృషి చేస్తాం. మున్సిపల్ కమిషనర్‌తో ఇప్పటికే చర్చించాం. నానా కష్టాలు పడి, డబ్బులు వెచ్చించి మొక్కలు నాటితే వాటన్నిటినీ రోడ్ల కోసమని, విద్యుత్‌లైన్ల కోసమని పూర్తిగా తొలగిస్తున్నారు.

- రెడ్డి రాజగోపాలనాయుడు, అభిమాని ఫౌండేషన్ చైర్మన్



చెత్తా చెదారాలతో నిండిన బొబ్బిలి పట్టణంలోని కోటిచెరువు

దేశమ్మ తల్లికి పూజలు

● మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరిన భక్తులు

సాలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మేలో నిర్వహించనున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండగ నేపథ్యంలో ఆదివారం దేశమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే దేశమ్మతల్లి చెట్టు వద్ద క్యూ కట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, ముర్రాట సమర్పించారు.



దేశమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

వైభవంగా గాయత్రీ మహాయజ్ఞం

గరుగుబిల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భగీరథపురంలో ఆదివారం నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం, సరస్వతిదేవి విగ్రహావిష్కరణ నిర్వహించారు. పార్వతీపురం స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు రామ్‌మోహన్‌రావు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కురుపాం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక కోటీనగర్ లేఅవుట్‌లో ఉన్న ఓ పబ్లిక్ స్కూల్‌పై ఈనెల 5వ తేదీన సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తుండగా రాయగడకు చెందిన టెక్నీషియన్ పాలక మురళీధర్(38) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం అతని తమ్ముడు సురేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఐటీడీఏ వర్గాలు తెలిపాయి. గిరిజనులు ఈ పీజీఆర్ఎస్‌ను వినియోగించుకోవాలని కోరారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగు పంటలతో ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు షణ్ముఖరాజు తెలిపారు. లక్కగూడ గ్రామంలో పెదపెంకి గోపినాథ్ పొలంలో ప్రాచీన సంప్రదాయ 14 రకాల వంగడాల గల వరి పొలంలో ఆదివారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

బొబ్బిలిరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణ విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 11.30 గంటలకు సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్టు విద్యుత్ అధికారులు తెలిపారు. బొబ్బిలి మున్సిపల్ పట్టణ, మండల పరిధిలో గల వినియోగదారులంతా తమ సమస్యలను ఈ వేదికలో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. చైర్మన్ డా.బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు సంకిలి మాసిలామణి, షేక్ బాబర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బొబ్బిలి శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక నోబుల్ పాఠశాలలో ఏబీవీపీ విభాగ్ ప్రముఖ్ బోండా కాశి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఏబీవీపీ పట్టణ శాఖ అధ్యక్షుడిగా ప్రగడ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జి.మహేశ్, కార్యదర్శిగా టి.ధనుంజయ్, సహ కార్యదర్శిగా బి.వెంకటేశ్‌తో సహా మరో పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

జూదరుల అరెస్టు

బొబ్బిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాతపెంట మామిడితోటలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్‌ఐ రమేష్ ఆదివారం పట్టుకున్నారని ఏఎస్‌ఐ జి.భాస్కరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,540 స్వాధీ నం చేసుకున్నారని చెప్పారు. వీరంతా రంగరాయపురం వాసులే.

మద్యం సీసాల స్వాధీనం

స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మల్లమ్మపేట గ్రామానికి చెందిన కోండ్రోతు సాయిశంకర్ వంద మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని, అరెస్టు చేసినట్టు ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు. ఈ కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.